అక్కమ్మ కోనేరుకు మహర్దశ

- చెరువు అభివృద్ధికి ప్రభుత్వం నిర్ణయం
- రూ.1.20 కోట్లతో ఆధునీకరణ
- త్వరలో పనులకు శంకుస్థాపన



జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న అక్కమ్మ కోనేరు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న అక్కమ్మ కోనేరుకు మహర్దశ కలగనుంది. అక్కమ్మ కోనేరును రజకులు తమ వృత్తి చెరువుగా వినియోగించుకుంటున్నారు. ఈ చెరువును అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. చెరువు ఆధునీకరణకు అమృత్ 2.0 నిధులు రూ.1.20 కోట్లు మంజూరు చేశారు. దీంతో ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు. చెరువు విస్తీర్ణం 3.4 ఎకరాలు కాగా చెరువు చుట్టూ ఉన్న జంగిల్ క్లియరెన్స్, సైట్ క్లియరెన్స్ చేపట్టారు. ఆ తరువాత చెరువును పూడిక తీసి సరిపడా లోతులో ఉంచుతారు. చెరువు చుట్టూ 380 మీటర్ల వాకింగ్ ట్రాక్ నిర్మిస్తారు. అలాగే చెరువు చుట్టూ గ్రీనరీ, స్టోర్ పిచ్చింగ్ చేపట్టనున్నారు. చెరువు చుట్టూ విద్యుదీకరణ పనులు చేపడతారు. అలాగే చెరువులో నీటి శుద్దీకరణ పరికరాలు (ఏరియేటర్స్) ఏర్పాటు చేస్తారు. ఈ పనులు పూర్తయితే పట్టణానికి అందమైన పార్కుతో పాటు వాకింగ్ ట్రాక్, తదితర సౌకర్యాలు ఏర్పడుతాయి. కాగా అక్కమ్మ కోనేరు ఆధునీకరణ పనులకు త్వరలో శంకుస్థాపన చేయనున్నారు.

ఆహ్లాదం కలిగించేలా..



ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే విధంగా పట్టణంలో మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న అక్కమ్మ కోనేరు చెరువును అభివృద్ధి చేయనున్నాం. కోనేరు అభివృద్ధితో పార్కు, వాకింగ్ ట్రాక్, చిన్నారులకు ఆటవిడుపు కలిగించే ఏర్పాట్లు చేస్తాం. పట్టణ సుందరీకరణలో భాగంగా చెరువును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతాం. పనులను త్వరలో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

– బత్తిన లక్ష్మి, చైర్‌పర్సన్, జంగారెడ్డిగూడెం

విజిటింగ్ పాయింట్‌గా..



కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పట్టణంలోని అక్కమ్మ కోనేరును అభివృద్ధి చేస్తాం. 3.4 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులో పూడిక తీయించి నీటి శుద్ధీకరణ చేసి, చుట్టూ పెన్సింగ్ వేసి ప్రజలకు ఆటవిడుపు కలిగించేలా, పట్టణానికి విజిటింగ్ పాయింట్‌గా తీర్చిదిద్దనున్నాం.

– పి.భవానీ ప్రసాద్, కమిషనర్, జంగారెడ్డిగూడెం

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ లబ్ధి



బుట్టాయగూడెం : సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు



కామవరపుకోట : సంక్షేమ పథకాల బుక్‌లెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

బుట్టాయగూడెం : అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని పులిరామన్నగూడెం సచివాలయం పరిధిలో బుధవారం 175వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను వెంటనే పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి రమణ, జెడ్పీటీసీ మొడియం రామ తులసి, మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ, వైస్ ఎంపీపీ గుగ్గులోతు మోహనరావు, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, సర్పంచ్ ఎం.శ్రీరాములు , ఎంపీటీసీలు వెంకటలక్ష్మి, గాలి దుర్గారావు, మండల ఉపాధ్యక్షులు సోదేం సుధాకర్, సచివాలయం కన్వీనర్ యోహాన్, నాయకులు ముత్తు, బానోత్ కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. బుధవారం మండలంలో ఆడమిల్లి గ్రామ పంచాయతీ వడ్లపల్లి నూతనం గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఆడమిల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఇంటింటికీ రేషన్ పంపిణీలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు రేషన్ బ్యాగులను అందజేశారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే అధికారులు దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు మిడతా రమేష్ బాబు, నానాది సాగర్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, జిల్లా గ్రీవెన్స్ సెల్ సభ్యులు డాక్టర్ రామకృష్ణ, తడికలపూడి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వీరా కుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆయిల్‌పామ్ మొక్కల ట్రాక్టర్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం : రాష్ట్రంలో రైతులకు జగనన్న ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని వాటిని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. బుధవారం స్థానిక నవభారత్ పామాయిల్ కర్మాగారం ఆధ్వర్యంలో రైతులకు మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా ఆయిల్‌పామ్ మొక్కలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తోందన్నారు. పామాయిల్ సాగులో రాష్ట్రంలో ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని, ఏలూరు జిల్లాలో చింతలపూడి నియోజకవర్గం ప్రథమ స్థానంలో ఉందని పేర్కొన్నారు. పామాయిల్ సాగులో అంతర్ పంటలు కూడా వేసుకుని రైతులు మరింత ఆదాయం పొందవచ్చన్నారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎస్.రామ్మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో 7వేల హెక్టార్లలో ఈ ఏడాది పామాయిల్ పంట లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నవభారత్ కర్మాగార జీఎం అంజియ్య మాట్లాడుతూ రైతులు వేసిన పామాయిల్ సాగుకు అనుగుణంగా తమ కర్మాగారం సామర్థ్యం పెంచుతున్నామన్నారు. పామాయిల్ మొక్క హైబ్రీడ్ రకం రూ. 300, దేశీయ రకం రూ. 90కు అందజేస్తున్నామని, ముందుగా రైతులు చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులు ఆయిల్‌పామ్ మొక్కలను తీసుకువెళుతున్న ట్రాక్టర్‌లను జెండా ఊపి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, రైతు నాయకుడు గడ్డమణుగు సత్యనారాయణ, నవభారత్ డీజీఎం రాజగోపాల్ (ప్లాంటేషన్), పీఆర్‌వో వీవీ రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ప్రభుత్వ భూమిని పంచేందుకు చర్యలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాల సూర్యనారాయణరాజు

టి.నరసాపురం : మండలంలో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి అర్హులకు పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు తెలిపారు. టి.నరసాపురం ఎంపీడీవో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. మండలంలో దాదాపు 2వేల ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉందని అన్నారు. అర్హులైన నిరుపేదలకు ఈ భూ పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తిచేస్తామన్నారు. అల్లంచర్ల రాజుపాలెం గ్రామంలో ఉన్న వందలాది ఎకరాల భూమిని గుర్తించేందుకు సమగ్ర సర్వే చేయించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కోరనున్నట్లు వివరించారు. పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుతో కలిసి వెళ్లి ఇక్కడ పరిస్థితులను సీఎంకు వివరిస్తామన్నారు. అల్లంచర్లరాజుపాలెంలోని భూదందాలకు, తమ పార్టీకి ఎటువంటి సంబంధం లేదన్నారు. గతంలో టీడీపీ హయాం నుంచే ఈ భూ వివాదాలు ఉన్నాయని గుర్తు చేశారు. మొగుడ్ని కొట్టి మొర్రోడు అన్న చందంగా టీడీపీ నాయకులు వ్యవహార శైలి ఉందని విమర్శించారు. వారే భూ దందాలు చేస్తూ, వాటిని అధికార పార్టీపై తోసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అల్లంచర్ల రాజుపాలెంలో అటవీశాఖకు, రెవెన్యూ శాఖకు , రైతులకు మధ్య వివాదం నడుస్తోందన్నారు. ఈ సమస్య పరిష్కారం విషయమై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించనున్నామన్నారు. అల్లంచర్ల విత్తనాభివృద్ధి క్షేత్రాన్ని కేటాయించిన 40 ఎకరాల భూమిలో ఆక్రమణలు తొలగించి దాని అభివృద్ధికి కృషిచేస్తామని వివరించారు. టి.నరసాపురం మండలంలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కృషిచేస్తున్నామని, ఆ ఫ్యాక్టరీ నిర్మాణానికి అవసరమైన భూమి ఉందన్నారు. కేతవరంలో గురుకుల పాఠశాల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అప్పలరాజుగూడెం స్పోర్ట్స్ కళాశాల ఏర్పాటుకు అవసరమైన భూమి ఉందని, కళాశాల ఏర్పాటుకు కృషిచేస్తున్నామన్నారు. మండలంలో రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మివెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలి



ద్వారకాతిరుమల : జి.కొత్తపల్లిలో అవగాహన ర్యాలీ



లింగపాలెం : యడవల్లిలో నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

ద్వారకాతిరుమల: బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి సూచించారు. మండలంలోని రామన్నగూడెం, దేవినేనివారిగూడెం, జి.కొత్తపల్లి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. అందులో భాగంగా ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు అవగాహనా ర్యాలీలను నిర్వహించారు. రామన్నగూడెం, దేవినేనివారిగూడెం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమన్నారు. జి.కొత్తపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ పిల్లలకు తల్లిపాలు పట్టించడం వల్ల వారిలో వ్యాధి నిరోదక శక్తి పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సుధ, సుబ్బాయమ్మ, జాన్సీరాణి, ఏఎన్‌ఎం విజయలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన ర్యాలీ

లింగపాలెం : నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగటానికి తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయని చింతలపూడి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి మాధవి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా లింగపాలెం మండలం యడవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లుల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో మాధవి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడం ఎంతో ఆరోగ్యదాయకమన్నారు. ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, బిడ్డ పుట్టిన నాటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో లింగపాలెం సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జె చిట్టిమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు అనంతరాణి, రాణి, మంగ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

కామవరపుకోట : తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని అంగన్‌వాడీ సీడీపీవో బ్యూలా అన్నారు. తల్లిపాల వారోత్సవాలో భాగంగా బుధవారం మండలంలోని రావికంపాడు, నూలకానివారిగూడెం, వెంకటాపురం గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో బ్యూల మాట్లాడుతూ పుట్టినప్పటి నుంచి కనీసం ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు పట్టించాలన్నారు. ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు తప్పనిసరిగా బిడ్డలకు తల్లిపాలు ఇచ్చే విధంగా సమయాన్ని కేటాయించాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో రావికంపాడు సర్పంచ్ నాగేశ్వరరావు, కామవరపుకోట సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంగాదేవి, అంగన్‌వాడీ వర్కర్స్ నాగమణి, సుజాత, సరోజినీ, రాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలవరం ఏఎంసీ చైర్‌పర్సన్‌గా శాంతకుమారి



బుట్టాయగూడెం : పోలవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కమిటీ చైర్‌పర్సన్‌గా ఆరేటి శాంత కుమారి నియమితులయ్యారు. ఈ మేరకు కమిటీ నూతన పాలకవర్గం నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి ఉత్తర్వులు జారీచేశారు. బుట్టాయగూడెంకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ సతీమణి ఆరేటి శాంతకుమారి. ఆరేటి కుటుంబం వైఎస్సార్‌సీపీ ప్రారంభం నుంచి పార్టీకి ఎనలేని సేవలు చేశారు. వారి సేవలను గుర్తించి శాంతికుమారికి పోలవరం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టారు. కాగా పోలవరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా తాడిగడప రామకృష్ణ, సభ్యులుగా తెల్లం దుర్గారావు, తోట జయబాబు, దాకారపు సాయిలక్ష్మి, దాకే మంగాయమ్మ, షేక్ ఫాతిమున్నీసా, చిట్టిబొమ్మ అనసూయ, బొట్ల కాశీ విశ్వనాథం, గంగుల రమణారెడ్డి, మాదిరాజు వెంకటేశ్వరావు, ముల్లిశెట్టి వేదకుమారి, ఆచంట నాగమణి, కొల్లూరు సత్యనారాయణ, దత్తి శ్రీదేవి, జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షులు, జిల్లా మార్కెటింగ్ అధికారి, కేఆర్‌పురం అగ్రికల్చర్ ఏడీ, పరింపూడి సర్పంచ్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా కమిటీకి గౌరవ చైర్మన్‌గా పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు వ్యవహరిస్తారు.

పింగళికి నివాళులు



పింగళికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో పింగళి వెంకయ్య 147వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.రవీంద్రబాబు మాట్లాడుతూ జాతీయ పతాక రూపకర్త, దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప దేశభక్తి కలిగిన జాతీయ నాయకుడు పింగళి వెంకయ్య అని కొనియాడారు. అధ్యాపకులు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కిసాన్ సెల్ కమిటీ సభ్యుడిగా తోట వెంకటేశ్వరరావు



కొయ్యలగూడెం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిసాన్ సెల్ కమిటీ సభ్యుడిగా అంకాలగూడెం గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. జూలై 30న విజయవాడలో నిర్వహించిన సమావేశంలో ఆలిండియా కాంగ్రెస్ కిసాన్ అధ్యక్షుడు కల్పాల్ సింగ్, రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు జెట్టి గురునాథరావు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీ మెట్ట ప్రాంత వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

వ్యక్తికి గాయాలు

జంగారెడ్డిగూడెం : ఒక వ్యక్తి తన భార్యను కొడుతుండగా, ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించిన వ్యక్తిపై దాడి చేసిన ఘటన మండలంలోని ఎ.పోలవరంలో జరిగింది. హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 1వ తేదీన రెడ్డిబోయిన దుర్గారావు తన భార్యను కొట్టేందుకు రాడ్డుతో వెంబడిస్తుండగా ఆ సమయంలో అక్కడే ఉన్న బెజవాడ రామకృష్ణ అడ్డుపడి ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించాడు. నా భార్యను నేను కొట్టుకుంటాను, నా ఇష్టం అంటూ దుర్గారావు తిరగబడినట్లు హెచ్‌సీ తెలిపారు. అనంతరం అదే రాడ్డుతో రామకృష్ణపై దుర్గారావు దాడి చేయగా, తలపై తీవ్ర గాయమైందని, స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స చేస్తున్నట్లు తెలిపారు.

బ్యాటరీలు చోరీ

స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో బ్యాటరీలు చోరీకి గురైనట్లు ఎస్‌డీఈ బి.సురేష్ ఫిర్యాదుచేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. గత నెల 28వ తేదీ రాత్రి బ్యాటరీలు చోరీకి గురయ్యాయని, ఈ మేరకు బుధవారం ఫిర్యాదు చేశారన్నారు.

పేకాటపై దాడి

మైసన్నగూడెంలో పేకాట శిబిరంపై బుధవారం దాడిచేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు హెచ్‌సీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వీరి నుంచి రూ.3,300 స్వాధీనం చేసుకున్నామన్నారు.

మరింత పారదర్శకంగా పౌష్టికాహారం పంపిణీ

కొయ్యలగూడెం : ఐసీడీఎస్ శాఖ ద్వారా గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహార పంపిణీ మరింత పారదర్శకంగా అమలు కానుంది. పౌష్టికాహార పంపిణీకి సంబంధించి ఆన్‌లైన్ సేవలను వినియోగంలోకి తీసుకురానుంది. ఇందుకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞాన ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ ప్రారంభించారు. పొంగుటూరు సెక్టార్ పరిధిలో సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో కార్యకర్తలు శిక్షణ తీసుకున్నారు. గురువారం నుంచి ఇంటింటికి వెళ్లి ఆన్‌లైన్ విధానం ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార సామగ్రిని అందజేయనున్నారు. లబ్ధిదారునితోపాటు కుటుంబానికి సంబంధించి మరొకరిని కూడా ఛాయిస్‌గా ఎంపిక చేసుకొని ఇరువురిలో ఏ ఒక్కరితో అయినా కూడా ఆన్‌లైన్ ద్వారా వేలిముద్రలు వేయించుకొని పంపిణీ చేయనున్నారు.

నష్టపరిహారం ఇప్పించాలని వినతి



ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీపీ వెంకటరెడ్డి, రైతులు

పోలవరం రూరల్ : పోలవరం మండలం కొత్తపట్టిసీమ గ్రామంలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైన వరి కుప్పలకు నష్టపరిహారం ఇప్పించాలని రైతులు పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్ రైతులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే నివాసం వద్ద కలిసి వినతిపత్రం సమర్పించారు. మే నెలలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో వరి కుప్పలు కాలి బూడిదయ్యాయని, పూర్తిగా రైతులు నష్టపోయారని, త్వరితగతిన నష్టపరిహారం ఇప్పించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులకు నష్టపరిహారం అందించేందుకు కృషిచేస్తానని చెప్పారు.



కామవరపుకోట : ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేస్తున్న వలంటీర్

లింగపాలెం : వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ →



పింఛన్ల పంపిణీ

కామవరపుకోట : అవ్వాతాతలకు, వితంతువులకు, దివ్యాంగులకు ప్రభుత్వం ప్రతినెలా వలంటీర్ల ద్వారా అందజేస్తున్న పింఛన్ పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. మంగళవారం పింఛన్ల పంపిణీ ప్రారంభించగా మిగిలినవారికి బుధవారం పంపిణీ చేశారు. కామవరపుకోట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన నల్లమిల్లి అమ్మాజీ కంటి సంబంధిత వ్యాధితో ఇటీవల జంగారెడ్డిగూడెం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కంటికి చికిత్స చేయించుకున్నారు. కొత్తూరు సచివాలయం వలంటీర్ మేడంకి అశోక్ బుధవారం తన సొంత ఖర్చులతో జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి వెళ్లి ఆమెకు రూ.2750 పింఛన్ అందజేశాడు.

84.75 శాతం పంపిణీ

లింగపాలెం : వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రెండోవ రోజు బుధవారం వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యదర్శుల ఆధ్వర్యంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్‌లు అందించారు. మండలంలో రెండోవ రోజుకి 84.75 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని అధికారులు తెలిపారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి



చింతలపూడిలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి : మణిపూర్ రాష్ట్రంలో మూడు నెలలుగా జరుగుతున్న మారణకాండకు నిరసనగా క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పెద్ద ఎత్తున శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక బోయగూడెం సెంటర్ వద్ద నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. క్రైస్తవుల ర్యాలీకి పట్టణ ముస్లింలు సంపూర్ణ మద్దతు తెలిపారు. స్థానిక జామియ మస్జిద్ కమిటీ సంఘీభావం ప్రకటించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు క్రైస్తవ మత పెద్దలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని, అక్కడి క్రైస్తవులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డా బిషప్ కొడుదుల అగస్టిన్ రాజు, పాస్టర్లు టి.రాజారత్నం, బి.జాషువ, కె. రాజీవ్‌డానియేలు, డా బి జాషువ, పి సైమన్ శామ్‌సన్, జామియ మస్జిద్ కమిటీ సభ్యులు, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కుక్కునూరు : మణిపూర్ ఘటనలను అదుపు చేసి, మహిళలపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం కుక్కునూరులో పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో శాంతిర్యాలీ నిర్వహించారు. కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం పాస్టర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో దాడులకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. శాంతి భద్రతలు నెలకొనేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ ప్రెసిడెంట్ డానియేలు, సెక్రటరీ జాన్‌విక్టర్, పాస్టర్లు జాన్‌విల్సన్, ప్రభుకిరణ్, వసంత్, చిన్ని, రూతుగ్లోరి ,ప్రదీప్, స్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం అందించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న వరద బాధితులు

కుక్కునూరు : గత ఏడాది జూలై నెలలో గోదావరి వరదతో ఇళ్లు కూలిన వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం అందించాలని కోరుతూ మారేడుబాక, ఉప్పరమద్దిగట్లకు చెందిన గ్రామస్తులు బుధవారం కుక్కునూరు తహసీల్దార్ డీఎల్ ప్రమద్వరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, గత ఏడాది గోదావరి వరదలతో ఇళ్లు కూలిపోయి నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం పరిహారం ప్రకటించగా అధికారులు కొందరు బాధితుల ఖాతాలలో నష్టపరిహారాన్ని జమచేశారన్నారు. చాలామంది బాధితులకు ఇంకా నష్టపరిహారం అందాల్సి ఉందన్నారు. ఇంకా నష్టపరిహారం జమకాని బాధితులకు నష్టపరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మారేడుబాక, ఉప్పరమద్దిగట్లకు చెందిన వరద బాధితులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వెంటనే ఇవ్వాలి

పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, ఇతర పరిహారాలు ఇచ్చి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు తరలించి నిర్వాసితులను ఆదుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం కుక్కునూరులో జరిగింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గోదావరి వరదలు సంభవించినప్పుడు నామమాత్రం సహాయక చర్యలు చేపట్టి నిర్వాసితులతో ప్రభుత్వం చెలగాటమాడుతుందన్నారు. ప్రస్తుతం సంభవించిన వరదలకు నష్టపోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య, వరకా శ్యామల, బాబురావు తదితరులు పాల్గొన్నారు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

జంగారెడ్డిగూడెం : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏలూరు రోడ్డులో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణం సుందరీకరణలో భాగంగా భారీ స్థాయిలో ఎవెన్యూ ప్లాంటేషన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా 5000 మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. అలాగే ప్రతి ఇంటికి రెండు మొక్కలు చొప్పున 20 వేల మొక్కలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీరత్నం, పట్టణ అధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు, జిల్లా యూత్ కమిటీ అధ్యక్షులు పడమటి గిరిబాబు గౌడ్, కౌన్సిలర్‌లు, నాయకులు బత్తిన చిన్న, గెద్దాడ శ్రీనివాస్, కమిషనర్ పి.భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పోలవరం డివిజన్
9951602915 (పోలవరం)
9505508399 (చింతలపూడి)
Office mail : tpgadvt@gmail.com